


# నన్ను క్షమించవూ?

కథానిక :

కోడూరి శ్రీరామమూర్తి

“ఆపరేషన్ సక్సెస్” అన్నారు డాక్టర్లు

“అయితే — రంగధామరావుగారు మళ్ళీ మనుషుల్లో పడ్డారన్నమాట—” అన్నారు శ్రేయోభిలాషులు

“దేవుడనేవాడు ఉన్నాడుసుమా!—” అన్నారు ఊళ్ళోవాళ్ళు అతగాడి ఎదురుగా.

ఎవరేమనుకుంటేనేం — రంగధామరావుగారు మనుషుల్లో పడటమేకాదు— అపోజిషన్ పార్టీవాళ్ళ గుండెల్లో రాయై కూడా పడ్డారు. యిదీ వాస్తవం

* * *

యింతా చెప్పాక రంగధామరావుగారి గురించి మరికొన్ని వివరాలు యివ్వకపోవటం అసమంజసం. అయితే

ఆ జగమెరిగిన బ్రాహ్మణ్ణి గురించి సూక్ష్మంగా చెప్పడం యిబ్బందికరమైన విషయమే మరి.

మా వూళ్ళో (అది ఏ వూరన్నా కానివ్వండి)– ఊరికి కాస్త ఆ మూలగా వున్న బాలికల పాఠశాలను చూచినప్పుడూ, కొంచెం యిటుగా వున్న ధర్మసత్రాన్ని చూచినప్పుడూ – రంగధామరావుగారు జ్ఞాపకం రాకమానరు.

అయితే – రంగధామరావుగారు చేతికి ఎముక లేకుండా పుట్టారనీ, ఆయనమనసు సాక్షాత్తూ వెన్నపూస అనీ, అవి కాస్తా కరిగిపోతుందన్న భయంతోనే ఆయన వేసవికాలంలో కొడై కెనాల్ వెడుతూంటారనీ, యిలాంటి మాటలు నేను చెప్ప దలచుకోలేదు. ఎందుకంటే బొత్తిగా నేను ఆయన పార్టీ మనిషిని కాదుకాబట్టి.

అలాగే – రంగధామరావుగారికి మునిసిపాలిటీ కార్యకలాపాలలో వున్న లాలోచీలూ – ఊళ్ళో అనేక ప్రజాహిత సంస్థలలో ఆయన చేయి దూర్చడానికి గల కారణాలూ – ఇవన్నీ నేను త్రవ్వ దలుచుకోలేదు. ఎందుకంటే, నేను అవతలపార్టీ మనిషినికూడా కాదుకాబట్టి.

నాకు తెలిసిందీ, కావల్సిందీ, వాస్తవం.

అందుకే – నేను రంగధామరావుగారు సకుటుంబంగా తిరుపతి వెడుతూ కారు ప్రమాదానికి లోనయ్యారని విని బాధపడ్డాను. ఏక్సిడెంట్‌లో మిగతావాళ్ళెవ్వరికీ చెప్పుకోదగ్గ గాయాలు తగలలేదని విన్నప్పుడు ఎంత ఆనందించానో– రంగధామరావుగారి తలకి ప్రమాదకరమయిన గాయాలు తగిలాయనీ, కళ్ళు బాగుపడటం చాలా కష్టమనీ విన్నప్పుడు అంతగా విచారించాను.

ఈ సంగతి వినగానే రంగధామరావుగారి అనుయాయులు "దేవుణ్ని చూడ్డానికి వెడుతూ ప్రమాదమా?– దేవుడనే వాడు ఉన్నాడా?" అని అంటే–

అవతలి పార్టీవాళ్ళు –

"చేసినపాపాలు ఊరికే పోతాయా?– దేవుడనేవాడు ఉన్నాడు మరి!–" అంటూ సమాధానపడ్డారు.

ఎవరేమనుకొంటేనేం – రంగధామరావుగారికి లోకం చీకటైపోయింది. చీకట్లో చిందులాడాల్సివచ్చిన రంగధామరావుగారు ఏడాదిపాటు లోకానికి కాంతిపథాన్ని చూపలేకపోయారు.

కాని – నాటికి నేడు – ఈ క్రొత్త డాక్టరు ధర్మమా అని, ఊరికి వెలుగొచ్చింది; రంగధామరావుగారి కంటికి చూపొచ్చింది.

సరే – యిప్పటికే చాలా చెప్పాను. ఇంకా చాలా చెప్పి మీకూ కథకూ మధ్య అడ్డంగా నిలబడి, మిమ్మల్ని విసిగించ దలుచుకోలేదు. రైరో – నౌ యు కెన్ ప్రొసీడ్...

*　　*　　*

రంగధామరావుగారు కళ్ళు విప్పి,

చూచేసరికి ఏదో వింతజగత్తులోకి అడుగుపెట్టిన ట్లనిపించింది. వెలుగు కిరణాలు ఒక్కసారిగా ఆయన కళ్ళల్లోకి గుచ్చుకుంటే, బాధగా ఆయన కళ్ళు మూసుకున్నారు

మళ్ళీ మెల్లగా కళ్ళుతెరిచా రాయన

అంతా వెలుగు; వెలుతురు. ప్రపంచమంతా కొత్తగా వుంది. వెలుగురేఖలు చీకటిని మెడపట్టి క్రిందకు తోస్తున్నాయి బాధగా మూలుగుతోంది చీకటి.

"నౌ యు అర్ ఆల్‌రైట్. అర్ యు నాట్?" నవ్వుతూ అంటున్నాడు డాక్టర్ గిరిధర్.

నమ్మలేనట్టుగా ఒక్కసారి అటూ, యిటూ చూచారు రంగధామరావుగారు

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ పట్టరాని ఆనందాన్ని మనసులోనే దాచుకుంటూ నవ్వుతోంది భార్య సరోజని. భావోద్వేగంతో ఆమె పెదాలు వణుకుతున్నాయి.

"నౌ యు అర్ క్వయిట్ అల్‌రైట్, మిస్టర్ రంగధామరావ్!" మీ ఆరోగ్యం కోసం మీ మిసెస్ ఎంత ఆదుర్దా పడ్డారనుకున్నారు? ఆమె ముఖాన్ని చూడండి!" అన్నాడు డాక్టర్ – సరోజినిని చూపిస్తూ.

ఆమెవైపు తిరిగి భారంగా– "సరూ" అన్నారు రంగధామరావుగారు.

ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్న సరోజని ఆనందాతిశయంలో– "నేను మీకు నిజంగా కనబడుతున్నానా? ఇది కల కాదుకదా?" అంది పొరలివస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ.


"అవును సరూ! నా కన్నీ కనబడుతున్నాయి డాక్టర్ గిరిధర్... టేబిల్ ఫేన్... బల్ల... కుర్చీ... . నే నన్నిటినీ చూడగలుగుతున్నాను. నా కందరూ కనబడుతున్నారు." అన్నాడు ఆనందాతిశయంతో మాటలు తడబడుతూ.

"యు అర్ రియల్లీ లక్కీ." అంటూ తేలిగ్గా నిశ్వసించారు డాక్టర్.

గాద్గదికమైన స్వరంతో అన్నారు రంగధామరావుగారు– "అదృష్టం నాకు చూపు లభించడం కాదు డాక్టర్, మీలాంటి డాక్టర్ లభించడమే నా అదృష్టం ఎన్ని జన్మలకయినా మీ ఋణాన్ని తీర్చుకోలేను."

గంభీరంగా నవ్వాడు డాక్టర్

"నేను నెరవేర్చింది వృత్తిధర్మం. ఇందులో త్యాగంలేదు. మీరు జీవితాంతం మరచిపోలేని కృతజ్ఞత చూపించుకోవాల్సింది ఈ నేత్రాలు దానం చేసిన దాతకి. తన కంటితో మీకు వెలుగు నిచ్చాడు. తన జీవనజ్యోతి ఆరిపోతూంటే ఆ జ్యోతిని ఆరిపోకుండా పట్టుకోండంటూ పక్కవాళ్ళ కందించాడు. మధ్యలో సంపాదించుకున్న ఆస్థిపాస్తులు తనతో రావడంలేదని బాధపడే మనిషి– పుట్టిననాడే దేముడు తన కిచ్చిన ఇంద్రియాలపై మమకారాన్ని తెంచుకుని వెళ్లి




పోతా ననడం జ్ఞానానికీ, త్యాగానికి పరాకాష్ఠ. ఆయన త్యాగమే మీ పాలిటి అదృష్ట మైంది."

"నిజం డాక్టర్. ఆయన నా పాలిటి దేముడు–'' అస్పష్టంగా గొణుక్కున్నారు రంగధామరావుగారు

డాక్టరూ, తండ్రీ మాట్లాడే మాటలు అర్థంకాని – రంగధామరావుగారి ఎనిమిదేళ్ళ పాప రోజీ – ఆశ్చర్యంగా మెరిసే కళ్ళతో తండ్రివైపు చూస్తోంది.

'అయితే, నాన్న కళ్లు నిజంగా బాగయిపోయినాయా ?– నాన్న యిది వరకటిలాగా మామూలుగా నడవగలడా ?–' ఆ చిన్ని మస్తిష్కంలో ఎన్నో ప్రశ్నలు కదులాడుతున్నాయి. ఆశ్చర్యంగా తండ్రిని చూస్తోంది రోజీ, గదిలో కొంచెం మూలగా వున్న కుర్చీ మీద నుంచొని.

రోజీకి తండ్రిదగ్గిరకు వెళదామనే వుంది కాని – ప్రక్కన డాక్టరున్నారు. వారిని చూస్తే భయం తనకి. అతని పెట్టినిండా పొడుగుపాటి సూదులుంటాయి. గబుక్కున ఏ సూదయినా తనకు గుచ్చేస్తే ?– ఇంకేమన్నా వుందా ?– నొప్పి పుట్టెయ్యదూ ?–

అందుకే– డాక్టర్ వచ్చినప్పుడు సాధ్యమైనంత దూరంగా వుంటుంది తను.

పోయినఏడాది – కారుఏక్సిడెంట్‌లో వంటికి గాయాలు తగిలినప్పుడు ఈ డాక్టర్ వద్దంటున్నా వినకుండా మంట పుట్టించే మందులు రాయటం తనకింకా జ్ఞాపకముంది. అలాంటి విషయాలు అంత త్వరగా మరచిపోగలదా తను ?

డాక్టర్‌కి రోజీ అంటే ఎంత అభిమానమో – రోజీకి ఆయనంటే అంత భయం. బాబ్డ్‌హెయిర్‌తో – ముద్దొచ్చే బుగ్గలతో, చక్రాల్లాంటి కళ్ళతో ఎంతో

అందంగా వుండే రోజారాణి అంటే ఎవరికి అభిమానం వుండదు?_ రంగధామరావుగారిని చూడటానికి వచ్చినప్పుడు కనీసం ఓ రెండు నిముషాల సేపు రోజీతో మాట్లాడకుండా వుండలేదు డాక్టర్.

"రోజీ!_ యిప్పుడు మీ నాన్నగారిని చూడు_" అంటూ నవ్వుతూ పిలిచాడాయన రోజారాణిని.

భయంభయంగా కుర్చీ దిగి, మెల్లిగా అడుగులు వేస్తూ తండ్రి మంచం దగ్గరకు వచ్చింది రోజారాణి.

"నాన్నకు బాగయిపోయిందమ్మా_" కూతురు తల నిమురుతూ అంది తల్లి.

రోజారాణిని చూడగానే రంగధామరావుగారి ముఖం ఏదో క్రొత్త వెలుగుతో ప్రకాశించింది.

"తల్లీ, రోజీ!_ నిన్ను మళ్ళీ నా కంటి వెలుగుగా చూడగలుగుతా ననుకోలేదమ్మా!" అన్నా డాయన కూతురు చేతిని ఆప్యాయంగా నిమురుతూ, కంపించే గొంతుకతో.

నవ్వుతూ అన్నాడు డాక్టర్_

"గడిచినదంతా పీడకల. మరచిపోండి. ఇక ముందున్నదంతా ఉజ్జ్వల భవితవ్యం."

తేలిగ్గా నిట్టూర్చారు రంగధామరావుగారు.

*  *  *

ప్రక్కరోజు ప్రొద్దున్న రంగధామరావుగారు కాఫీ త్రాగుతుండగా, తండ్రి కళ్ళను పరీక్షగా చూస్తూ అడిగింది రోజీ_

"నాన్నా! యివి నిజంకళ్ళా? లేక బొమ్మకళ్ళా?"

ఆ మాటకు గంభీరంగా నవ్వుతూ అన్నారు రంగధామరావుగారు:

"బొమ్మకళ్ళే అయితే చూపు ఎలా వుంటుందమ్మా? యివి నిజంకళ్ళే!"

తండ్రి చెప్పిన సమాధానం నమ్మదగినట్టుగా కనిపించలేదు రోజీకి.

"మరి అయితే, నీ కళ్ళు పోయాయిగా!" అంది తన కళ్ళను చక్రాల్లా తిప్పుతూ.

కాఫీకప్పు బల్లమీద పెడుతూ అన్నారు రంగధామరావుగారు_

"అవును_ నిజమే_ పోయాయి తల్లీ_ వాటిబదులు మరొకటి పెట్టారు."

ఇంకా సందేహం తీరలేదు రోజీకి. పైగా మరోసందేహం పుట్టుకొచ్చింది.

"మరయితే, డాక్టరుగారు కళ్ళుకూడా తయారు చేస్తారా?"

కూతురి అమాయకపు ప్రశ్నకు గంభీరంగా నవ్వుతూ అన్నారు రంగధామరావుగారు.

"లేదమ్మా ఎవరివో కళ్ళు నాకు పెట్టారు."

ఈ మాటలు రోజారాణికి మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి

"మరి_ వాళ్ళకో?"

ఆ చిన్ని హృదయానికి 'నేను' 'నువ్వు' అనే మాటల మధ్య ఉన్న అగాధం అర్థంకాదు. ఆ రెండూ ఒకటే అనుకునే పసితనం — ఆ రెండిటి మధ్యా విభేదం ఎందుకుండా లనుకునే అమాయకత్వం — ఆమె కింకా పోలేదు.

రోజీ ప్రశ్నకు బాధగా నవ్వుతూ అన్నారు రంగధామరావుగారు :

"ఈ కళ్ళుగలాయన లేడు; చచ్చిపోయాడు. అందుకే యివి నాకు వచ్చాయి "

వెంటనే మంచిప్రశ్న వచ్చింది.

"అయ్యో - పాపం! మరి, ఆయన నీకు తెలుసా ?"

రోజీ ప్రశ్నలో ఏదో తెలియని బాధ. కుతూహలం సమ్మిళితమై గొంతు చిత్రంగా ధ్వనించింది.

'ఏమి టీ ప్రశ్నలు? ఏమని సమాధానం చెప్పాలి తను? అదృష్టాన్ని కొనుక్కున్నానని చెప్పాలా?' త్యాగాన్ని యాచించానని చెప్పాలా?— విసుక్కున్నారు రంగధామరావుగారు.

"తెలియదు తల్లీ," అన్నా డాయన.

"మరి, తెలియకుండా వీటిని నీ కెందుకిచ్చాడు? మనింటికి రోజూ అడుక్కోడానికి వస్తూంటాడు — రామయ్యతాత — అతని కెవరూ యిలా యివ్వలేదేం — ఈ డాక్టర్ వాడికళ్ళు బాగుచెయ్య దెందు కనీ?"

సమాధానం చెప్పలేని రోజారాణి ప్రశ్నలవలలో చిక్కుకుని గిలగిలా కొట్టుకుంటున్నారు రంగధామరావుగారు.

రోజారాణి ప్రశ్నల పరంపర వింటున్న వాళ్ళమ్మ, కాఫీకప్పు తీస్తూ విసుక్కొంది ·

"ఎప్పుడూ అర్థం పర్థంలేని ప్రశ్నలు ఎన్నిసార్లు చెప్పాలీ - నాన్నను విసిగించొద్దని?"

భార్యను వారిస్తూ అన్నారు రంగధామరావుగారు "లేదు సరూ, దాని ప్రశ్నలు అర్థంలేనివికావు. అమాయకపు ఆ పసిహృదయంలో మహోన్నతమైన జ్ఞానం దాగివుంది. మనం ఆలోచించడానికయినా తీరిక చేసుకోని 'కృతజ్ఞత' గురించి ఆ లేతహృదయం ఆరాటపడుతోంది. ఇన్నాళ్ళూ మనం మన అదృష్టానికి పొంగిపోతూ ఆనందిస్తున్నామే కాని — ఈ నేత్రాలు దానం చేసిన దాత ఎవరో, ఎక్కడివాడో అన్న విషయం తెలుసుకోవాలన్న జ్ఞానం — కనీసం కుతూహలం లేకపోయింది మనకు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం. రోజీ నా కళ్ళు నిజంగా తెరిపించింది. ఇవాళ డాక్టర్ రాగానే ఆ నేత్రదాత పేరేదో కనుక్కుంటాను. అతడు బీదవాడయితే అతడి కుటుంబానికి చేయగల సాయం చేసి కృతజ్ఞత చూపించుకుంటాను;" ఆవేశంగా అంటున్నారు రంగధామరావుగారు.

"ఏమిటో — పసిదాని మాటలక

అనవసరంగా అంతంత అర్థాలు తీస్తు న్నారు — మీ యిష్టం." అని గొణు క్కుంటూ లోపలకు వెళ్ళిపోయింది సరోజని.

* * *

"డి. వరదరాజన్,

సర్వర్, బసంత్ కేఫ్,

హాస్పటల్ రోడ్ — వెల్లూరు."

డాక్టర్ పంపిన చిరునామా చూడ గానే రంగధామరావుగారికి ఏదో తెలి యని గగుర్పాటు కలిగింది.

వరదరాజన్ !— వరదరాజన్ !— గుండెల్లో ఆపేరు ప్రతిధ్వనిస్తోంది.

జ్ఞాపకాల కెరటాలు గుండెల్ని పిండి చేస్తున్నాయి. తను ఏనాడో మరచిపో యిన పేరు— తన స్మృతిపథంలో దాదాపుగా చెరిగిపోయిన పేరు - ఒక్క సారిగా జ్ఞాపకం వచ్చింది.

"అదృష్టమన్నది దేవుడి చేతిలో లేదుగురూ. మనం సాధించుకోవాలి నువ్వు నా పక్కన వుండి చల్లగా కబుర్లు చెబుతూవుంటే, నే నెంత అదృష్టాన్నయినా సాధించేయగలను—" అంటూ తన వ్యక్తిత్వాన్ని ఎంతగానో అభిమానించే వరదరాజన్... "జీవి తంలో చేదును చవిచూచినవాడే తీపిని అనుభవించగలడు; కష్టపడినవాడే సుఖాన్ని ఆస్వాదించగలడు. ఇవాళ మనం కష్టపడటం—రేపు మరింత ఆనం దాన్ని అనుభవించడం కోసమే—" అంటూ - జీవిత పోరాటంలో సిరసించి- ఎదురీదలేక అలసిపోయిన — తనని భుజం తట్టి ప్రోత్సహించిన వరద రాజన్ — కష్టంలోనూ, సుఖంలోనూ హాయిగా నవ్వగల వరదరాజన్...

ఈ అగంతకుడు ఆ వరదరాజన్ కాగలడా ?

ఏనాటి వరదరాజన్ ? ఏనాటి మురుగన్ కేఫ్ జీవితం ? ఆ అనుభూతు లను యింకా ఎందుకు జ్ఞాపకం పెట్టు కుంటున్నాడు తను ?

గుండెల్లో ఎవరో ఫక్కున నవ్వుతున్న ట్టనిపించింది.


"గత జీవితాన్ని నువ్వు మరచిపో లేవు మిస్టర్ రంగధామరావ్. నీ కది సాధ్యంకాదు. నువ్వు నీ పాపాన్ని మరచిపోయినా — పాపం మాత్రం నిన్ను మరచిపోదు !"

అంతరాత్మ నవ్వు వికటాట్టహాసంలా అనిపించింది రంగధామరావుగారికి.

వళ్ళంతా స్వేదమయమైపోయింది.

"ఛ ! ఛ ! ఏమిటీ అర్థంలేని ఆలోచనలు ? ఎక్కడి హైదరాబాదు? ఎక్కడి వెల్లూరు ? అయినా ప్రపం చంలో ఎంతమంది వరదరాజన్ లు లేరు కనుక !"

బాధతో కణతలు పట్టుకొన్నారు రంగధామరావుగారు. అప్రయత్నంగా ఆయనకు మెరపులాంటి ఆలోచన తట్టింది.




ఈ అగంతకుడి ఫోటోను తను సంపాదించ గలిగితే? అవునవును. సంపాదించగలిగితే...

వెంటనే టెలిఫోన్ తీసి డాక్టర్‌కు ఫోన్ చేశా డాయన.

రంగధామరావుగారు ఫోన్ చేస్తున్నా రని తెలియగానే—

"హల్లో — మిస్టర్ రావ్ — గుడ్ మార్నింగ్ — మీ రడిగినట్టుగా డోనర్ పేరు పంపించాను చూశారా?" అన్నాడు డాక్టర్.

"థేంక్స్, డాక్టర్। అందులో వెల్లూ రని వుంది..." రంగధామరావుగారు మాటలు తడబడుతున్నారు

"అవును ఆ పెయిర్ ఆఫ్ ఐ మా హాస్పటల్‌కి సిల్వర్ జూబిలీ బహు మతిగా వెల్లూరునించి వచ్చాయి. ( డోనర్ దాతృత్వంతో మాకు అమూల మైన కానుక లభించడమేకాదు. మ వూరికికూడా గొప్ప అదృష్టం లభి చింది కదూ — మిస్టర్ రావ్?" నవ్వుత అంటున్నాడు డాక్టర్.

"అది సరేగాని - మీ వల్ల నా మరో సహాయం కావాలి. ఆ డోన ఫోటో ఒకటి నాకు కావాలి. వీల తుందా?"

ఓ క్షణం తటపటాయించి అన్నా డాక్టర్ :

"మీరు ఎంత ఉత్తమాశయాలు కలవారో నాకు తెలుసు. కాని – మీ రడిగిన సహాయం చెయ్యలేనేమోనని నా అనుమానం. ఎందుకంటే, వెల్లూరు హాస్పిటల్‌లో అతడి ఫోటో ఉండే అవకాశం లేదు. పెర్సనల్‌గా ఎవరినయినా అడ్రస్‌కు కాంటాక్టుచేసి ఫోటోఏదన్నా వుంటే పంపించమనాలి. కాని – యిది అంత సులభంగా అవుతుందనుకోను."

"ప్లీజ్, డాక్టర్! ఎంతఖర్చయినా పర్వాలేదు. నా కా ఫోటోమాత్రం కావాలి. మీ ఉపకారం నే నెప్పటికీ మరచిపోలేను."

"ఐ విల్ ట్రయ్ మై లెవల్ బెస్ట్. అంతవరకూ మాత్రమే చెప్పగలను. అయినా – ఈ కాలంలో యింత కృతజ్ఞత వున్నవాళ్ళను ఎక్కడా చూడలేదు." ఫోన్ పెట్టేస్తూ అన్నాడు డాక్టర్ గిరిధర్.

తేలిగ్గా నిట్టూర్చారు రంగధామరావుగారు.

డాక్టర్ గిరిధరరావుకు వెల్లూరులో చాలామంది స్నేహితు లున్నారు. అది తనకు బాగా తెలుసు. ఎలాగయినా గిరిధరరావు తప్పకుండా ఆ అగంతకుడి ఫోటో సంపాదిస్తాడు. తనకా నమ్మకం వుంది.

ఫోటో రాగానే తన అనుమానం పూర్తిగా తొలగిపోతుంది. ఆ ఫోటో వరదరాజన్‌ది కాదని నిర్ధారణ అయిపోతుంది. కాలగర్భంలో కలిసిపోయిన వరదరాజన్ గురించిన ఆలోచనలు ఇక క్షణకాలంకూడా తన మస్తిష్కంలో చోటు చేసుకోలేవు.

"భగవాన్! నాకింకేమీ వద్దు. ఈ అగంతకుడు నా పాత స్నేహితుడు వరదరాజన్ కాదని ఋజువు చెయ్యి. నేను నిన్నింకేమీ కోరను–" తల పట్టుకొంటూ గొణుక్కున్నారు రంగధామరావుగారు.

* * *

సన్నగా చినుకులు పడుతుండగా ఓ కారు రంగధామరావుగారి 'శోభా నిలయం' పోర్టికోలో ఆగింది.

కారులోంచి డాక్టర్ దిగి రంగధామరావుగారుండే మేడమీది గదిలోకి వెళ్ళేసరికి ఆయన తల పట్టుకొని ఏదో ఆలోచిస్తున్నాడు.

"గుడ్‌మార్నింగ్ – మిస్టర్ రావ్! నెల్లాళ్ళు ఆలస్యమయినా మీ రడిగిన పని సాధించాను," అన్నాడు డాక్టర్ గిరిధర్ హేట్ తీసి బల్లమీద పెడుతూ.

డాక్టర్ మాటలు నమ్మలేనట్లుగా ఓ క్షణం ఆశ్చర్యంగా చూశారు రంగధామరావుగారు.

"నిజమా! ఫోటో దొరికిందా?"

నవ్వుతూ అన్నాడు డాక్టర్:

"నిజం సార్, రంగధామరావుగారి ఆర్డరంటే సామాన్యమా మరి? ఎంత కష్టమైనా సాధించాల్సిందే."

తడబాటుతో అన్నారు రంగాధామ రావుగారు.

"ఏదీ? ఆ ఫోటో చూడనివ్వండి."

"అందుకేగా తెచ్చిందీ—అయినా, మీ పిచ్చిగానీ, ఎవడో ఒకసర్వర్ కళ్ళు దొనేట్ చేశాడే అనుకోండి; అంత మాత్రానికి యింత కృతజ్ఞత చూపించ దమా? అబ్బ! బొత్తిగా మీరు కామన్ అండర్‌స్టాండింగ్‌కి దొరకరు సార్!" అంటూ నవ్వుతూ ఫోటో తీసి రంగధామ రావుగారి చేతి కిచ్చాడు డాక్టర్.

వణకే చేతులతో ఫోటో అందు కున్నారు రంగధామరావుగారు

"ఈ ఫోటోకోసం ఎంత అవస్థ పడాల్సివచ్చిం దనుకున్నారు? అసలు యీ వరదరాజన్‌కి కేరాఫ్ ఎడ్రసే లేదుట. హోటల్‌లోనే పడుకుంటాడట. బొత్తిగా మతిస్థిమితం లేని మనిషట. ఇలాంటి వ్యక్తి ఫోటో సంపాదించడం ఎంత కష్టమో ఆలోచించండి? అదృష్ట వశాత్తూ – అతగాడి స్నేహితు డెవరి దగ్గిరో ఒతని ఫోటో వుంటే అది మనకు ఏచ్చింది ఈ ఫోటోకోసం పెర్రీమేసన్ పని చేయాల్సి వచ్చిం దంటే..." డాక్టర్ తన ప్రయోజకత్వం వర్ణించి చెబుతున్నాడు.

రంగధామరావుగారికి డాక్టర్ మాటలు వినిపించడంలేదు. ఓ క్షణం కళ్ళు మూసుకుని అస్పష్టంగా తనలో తను గొణుక్కున్నాడు.

"భగవాన్! నేను నిన్ను జీవితంలో మరేదీ కోరను. ఈ ఫోటో మాత్రం వరదరాజన్‌ది కాకుండా చూడు. నా గత జీవితాన్ని నేను సంపూర్తిగా మరచి పోయేలా చెయ్యి."

దేవుడు మనుషుల మాటలు వింటాడా మరి?

కళ్ళు తెరిచి ఫోటో చూచిన రంగ ధామరావుగారు ఒక్కసారిగా 'షాక్' తిన్నట్టు ఫీలయ్యాడు.

హైరోడ్ క్రాప్, నుదుట బొట్టు, మెడలో గొలుసు, నవ్వుతూ చూస్తు న్నాడు వరదరాజన్.

జీవిత సుడిగుండాల్లోనూ – ఆనందపు అంచుల్లోనూ, అదే నవ్వు. అదే ఆనందం ఎంత హాయిగా నవ్వగలడు వరదరాజన్? ఒకప్పుడు తాను ఆ నవ్వంటే ఎంత అభిమానించేవాడు?

రంగధామరావుగారు ఇప్పుడా నవ్వు చూచి ఆనందించలేకపోతున్నాడు. వరద రాజన్ చిరునవ్వులో ఆయన కిప్పుడు వికటాట్టహాసాలు వినబడుతున్నాయి

"మనిషికి సుఖాన్నిచ్చేది డబ్బు; క్షణకాలపు ఆనందానికావు బ్రదర్. వాటికి కక్కుర్తిపడి మంచినీ, మానవ త్వాన్నీ. ఆఖరికి ప్రాణప్రదమయిన స్నేహాన్నీ బలిచేసిన నువ్వు పాపానికి ఫలితాన్ని అనుభవించక తప్పదు. కార్లల్లో, బంగాళాల్లో దాక్కొని నువ్వు ప్రపంచాన్ని మోసగించగలవు గానీ,

నీ అంతరాత్మను మోసం చెయ్యలేవు మిస్టర్ రంగధామరావ్! నువ్విప్పుడు ప్రపంచాన్ని చూస్తున్నది నా కళ్ళల్లోంచి. నువ్వు చూస్తున్న ప్రపంచాన్ని చూపిస్తున్నది నేను మనిషి చచ్చినా ఆత్మ శాశ్వతమని నీకు తెలియంది కాదు. నేను చచ్చినా నా పగ చల్లారలేదు. నా ఆత్మ ప్రతీకారాన్ని వాంఛిస్తూ ఎప్పుడూ నీ 'శోభా నిలయం' చుట్టూ పరిభ్రమిస్తూనే వుంటుంది. వెలుగు నిచ్చాయనుకున్న నీ కళ్ళే నీకు చీకటి నిస్తాయి వక్రగతిలో ప్రపంచం కనబడి, అన్నింటా నీకు పరాజయమే ఎదురవుతుంది శోభానిలయం వల్లకాడవుతుంది "

భీకరాట్టహాసం రంగధామరావుగారి మస్తిష్కంలో ప్రతిధ్వనించింది. ఆయన ఒళ్ళంతా స్వేదమయమైపోయింది. భూమిఅంతా బొంగరంలా తిరుగుతున్నట్టనిపించింది

'రాజూ! నన్ను క్షమించు రాజూ! నన్ను వదిలిపెట్టెయ్యి రాజూ!' భయంతో దడదడ కొట్టుకుంటున్న గుండెల్ని అదుముకుంటూ అస్పష్టంగా గొణుక్కుంటున్నాడు రంగధామరావుగారు.

రంగధామరావుగారి అవస్థ అర్థం చేసుకోలేని డాక్టర్ "వ్వాట్ సార్! ఫోటో అంత సేపు చూస్తున్నారు – పెళ్ళి చూపుల ఫొటోలాగ మీ కృతజ్ఞత చూపించుకొనేందుకు ఆయిల్ పెయింట్ చేయించి గోల్డ్ ఫ్రేమ్ కట్టిద్దురుగాని లెండి;" ఛలోక్తి విసురుతూ అంటున్నాడు.

డాక్టర్ మాటలు వినిపించుకునే స్థితిలో లేరు రంగధామరావుగారు. ఆయన మస్తిష్కంలో అగ్నిగోళాలు బ్రద్దలవుతున్నాయి. ఈ మానసిక కల్లోలానికి ఆయన తట్టుకోలేకపోతున్నాడు.

వివర్ణమైపోతున్న రంగధామరావుగారి ముఖాన్ని చూచి డాక్టర్ కొద్దిగా ఖంగారు పడ్డాడు.

"వ్వాట్ మిస్టర్ రావ్? ఏమైంది?" అన్నాడాయన తడబాటుతో.

అప్పటికే రంగధామరావుగారు స్పృహతప్పిపోయారు

* * *


ప్రొద్దున్న కాఫీలవేళ. తండ్రితో అంది రోజారాణి· "నాన్నా, నాన్నా! నిన్న నువ్వెందుకలా పడిపోయావ్?"

అనుకోని ఈ ప్రశ్నకు తడబడుతూ అన్నాడు తండ్రి "ఏమోనమ్మా. నిన్న నా కేదో పీడకలలాగా వచ్చింది. ఎందుకో కళ్ళు తిరిగిపోయాయి..."

తండ్రి తనతగ్గిర అబద్ధం చెబుతున్నాడని కూతురు గ్రహించేసింది.

"భలేవాడివి నాన్నా. నువ్వు నిద్రపోకుండా కలెలా వచ్చింది నాన్నా? అయినా, డాక్టర్ గారితో మాట్లాడుతూండగా నిద్రెలా వచ్చింది నీకు?"

ఏమని సమాధానం చెప్పగలడు?




తడబడుతూ సమాధాన మేదో చెప్ప బోతున్నాడు.

ఇంతలో "అర్థం పర్థంలేని ప్రశ్నలు నాన్న నడగొద్దని లక్షసార్లు చెప్పాను. అయినా ఈ యింట్లో నీ కక్కురలేని గొడవలేదు కాఫీ త్రాగి, పోయి చదువుకోగూడదూ?" కేకలేసింది తల్లి.

బిక్కమొగం వేసి మెల్లిగా అక్కణ్ణించి తప్పించుకొంది రోజారాణి

ప్రమాదం తప్పినట్టుగా తేలిగ్గా నిట్టూర్చారు రంగధామరావుగారు. కాఫీ త్రాగి, కప్పు బల్లమీద పెడుతున్న రంగధామరావుగారితో అంది సరోజని

"నేను అంటే మీకు కోపంగానీ – రోజురోజుకూ మీరు అదోలా అయిపోతున్నారండీ."

భార్య మాటలకు సమాధానం చెప్ప లేని రంగధామరావుగారు, లేని గంభీరత్వాన్ని ముఖంమీద పులుముకుంటూ –

"అదేం? నేను మామూలుగానే వున్నానే.'' అన్నారు తడబడే గొంతుకతో.

మాటవరుసకు అన్నదేకాని సరోజనమ్మ ఆ విషయాన్ని అంతగా పట్టించుకోవడంలేదు అందుచేతనే, ఆవిడ తన మామూలుధోరణిలోకి వెంటనే తిరిగి రాగలిగింది.

"అది సరేగాని, మన రోజీ బర్త్‌డే దగ్గిరపడుతోంది కదా! మరి దానికి బట్టలు కొనొద్దూ?"

కుర్చీలోంచి లేస్తూ అన్నారు రంగధామరావుగారు.

"ఆ డ్యూటీ ఎప్పుడూ నీదేకదా! క్రొత్తగా నాతో చెప్పడం ఎందుకు? ఎంతకావాలేమిటి షాపింగ్‌కు?"

పళ్ళు ఫ్రెజిడేర్‌లో పెడుతూ అంది సరోజిని.

"అదికాదు. ఎప్పుడు నేను బట్టలు తెచ్చినా ఏమీ బాగాలేవంటూ మారాం చేస్తుంది. పోనీ, దీన్ని షాప్‌కు తీసుకు వెడదామంటే అది అసలే పీలుగాని పని నే నంటే దానికి భయంలేదు. అక్కడ నానాఅల్లరీ చేస్తుంది. కాబట్టి మీరే సాయంత్రం దీన్ని బట్టలకొట్టుకు తీసుకువెళ్ళి కావాల్సిన బట్టలేవో సెలక్ట్ చేసి తీసుకురండి."

"అలాగేలే," నవ్వుతూ అన్నారు రంగధామరావుగారు. ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో రోజారాణి రానే వచ్చింది.

"నాన్న సెలెక్షన్ అంటే నెంబర్ వన్‌గా వుంటుంది. పీలా పాతకాలం బట్టలు కొనదు నాన్న. అంతా అప్‌టూ డేట్."

మూతిముడుచుకుంది సరోజనమ్మ.

"ఊఁ? ఎలాగయితేనేం వచ్చాయి నాలుగు కాన్వెంటుముక్కలు."

తేలిగ్గా నవ్వుతూ అన్నారు రంగధామారావుగారు:

"అలాగేలేమ్మా! సాయంత్రం త్వరగా వచ్చి నిన్ను పికప్ చేసుకుంటాను. సరేనా?"

"మా మంచి నాన్న." గోముగా అంది రోజీ.

* * *

సాయంత్రం షాపులో బట్టలు చూస్తున్న రంగధామరావుగారు కూతురుతో అన్నారు:

"చూడమ్మా! నీ కీ రంగు బాగుంటుంది కదూ?"

అది విని రోజీ ఫక్కున నవ్వింది.

"అదేమిటి నాన్నా? అది ఎర్ర రంగు కదూ? ఎర్రరంగంటే నాకు యిష్టంలేదుకదా!" అంది.

అది విని షాపువాడు - "అబ్బెబ్బే! ఇది ఎర్రరంగులోకి రానేరాదు బాగా లేతరంగు మీకు చాలా బాగుంటుంది." అన్నాడు — రంగధామరావుగారిని సమర్థిస్తూ - ఎలాగయినా అంటగట్టేద్దామనే ఉద్దేశంతో.

రోజీ వాడివైపు చురచురా చూచింది

"ఛీఛీ! నాకారంగంటేనే అసహ్యం నా కిష్టమైన నీలంరంగు కావాలి," అంది స్థిరమైన గొంతుకతో.

ఇంటి కొచ్చాక కారు దిగుతూనే పకపకా నవ్వుతూఅంది రోజీ "అమ్మా! నాన్న నాకు ఎర్రరంగు గౌను కట్టించబోయాడు. నేను వెళ్ళకపోతే ఆ గుడ్డే కొనేసేవాడేమో కూడాను. పైగా - కొట్టువాడు అది ఎర్రరంగు కాదండీ అంటే - అవునవునంటున్నాడు నాన్న రంగులుకూడా గుర్తుపట్టలేక పోతున్నారు."

రోజీ మాటలు చిత్రంగా ధ్వనించాయి రంగధామారావుగారికి.

కూతురుమాటలకు -

"చెప్పానుగా-మీ నాన్న బాగా మారి పోతున్నారని," వంతపాడింది సరోజని.

ఏ మనాలో తెలియలేదు రంగధామ రావుగారికి.

హఠాత్తుగా ఆయనకు ఆఫీసులో జరిగిన విషయం జ్ఞాపకం వచ్చింది కంట్రాక్టులకు ఎస్టిమేషన్‌లు వేయడంలో బాగా అనుభవం సంపాదించుకున్న తను - ఇవాళ్ళ ఓ కంట్రాక్టుకి బాగా తక్కువ ఎస్టిమేషన్ వేశాడు. పైగా కూడి క తప్పయ్యింది. అది చూచి పార్ట్‌నర్ వెంకట్రావ్ నవ్వుతూ - "ఏమోయ్! రంగధామరావ్ - నీ ఆరోగ్యం బాగా లేనప్పుడే, ప్లాన్ చెబితే కరక్టుగా ఎస్టిమేషన్ చెప్పేవాడివి. ఇప్పుడిదేమిటి? ఐనా నీలో ఏదోమార్పు వస్తోందోయ్." అన్నాడు.

ఇప్పుడు భార్య కూడా అలానే అంటోంది.

"నిజంగా తనలో మార్పు వస్తోంది? లేకపోతే అందరూ అదే మాట ఎందుకంటారు? అదే నిజమయితే ఆ మార్పు ఎందుకొస్తోంది? ఆ మార్పు తనని ఎక్కడికి తీసికెడుతుంది?

మేడమీదకు వెళ్ళి అద్దంలో తన ముఖం చూచుకున్నారు రంగధామరావు గారు. ప్రకాశవంతంగా కనబడుతున్నాయి నేత్రాలు. వరదరాజన్ కళ్ళు చాలా అందంగా వుంటాయి నిజానికి అతగాడి అందమంతా కళ్ళల్లోనే వుంది.

"రాజూ! నీ కళ్ళను ముద్దెట్టుకోవాలనిపిస్తూందోయ్! ఇంత అందమైన కళ్ళు మొగవాడికి వుద్ధవేస్ట్," అంటూ హాస్యమాడేవాడు తను

కాని, కాని యిప్పుడు తన కా కళ్ళు అందంగా కనిపించడం లేదు. చాలా భయంకరంగా కనబడుతున్నాయి. ఆ కళ్ళల్లో ప్రతీకార జ్వాల భగ్గుమంటోంది

"నీ పాపానికి నేను ప్రత్యక్ష సాక్షిని. నీ కనుపాపల్లో నీ పాపపు బొమ్మ కనబడటంలేదూ? నువ్వు నన్ను గుర్తుపట్టలేవూ?"

గుండెల్లో కనుపాప వికటాట్టహాసం ప్రతిధ్వనిస్తోంది. తనకళ్ళ ప్రతిబింబాన్ని చూడలేక కళ్ళు మూసుకున్నాడు రంగధామరావుగారు.

'తన కంటికి చూపు రాకుండా వుంటే ఎంత బాగుండును?' అస్పష్టంగా గొణుక్కున్నాడు రంగధామరావుగారు.

కిటికీ తలుపులు తెరిచి శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడాయన

ప్రొద్దుటినించీ మేఘావృతమయిన ఆకాశం, క్రమక్రమంగా తన ప్రతాపం చూపిస్తోంది. సన్నగా ప్రారంభమైన చినుకులు పెద్ద వర్షంగా మారసాగాయి.

గ్లాస్ షట్టర్స్ మూస్తూ భారంగా నిశ్వసించాడు రంగధామరావుగారు. మెరుపులు, దూరంగా ఎక్కడో పిడుగు.

సరిగ్గా యిలాంటి వర్షం పడ్డరోజునే ఒకరోజు కోయంబత్తూర్‌లో కుండ పోతగా కురుస్తున్న వర్షాన్ని చూస్తూ, మూసేసిన కాఫీహోటల్ అరుగుమీద కూర్చొని బీడీ వెలిగిస్తూ అన్నాడు వరదరాజన్.

"గురూ! మనకి కోయంబత్తూర్ అచ్చిరాలేదు. ఎక్కడకు వెళ్ళినా, మన కన్నా ముందెళ్ళిన దురదృష్టం మనల్ని పలకరిస్తోంది. ఈ కోయంబత్తూర్ విడిచిపెడితే మన జాతకాలు బాగపడతా యనిపిస్తోంది. హాయిగా మీ ఆంధ్ర వెళ్ళిపోదాం. ఏ నెల్లూరులోనో, తిరుపతిలోనో చిన్న 'టీ' స్టాల్ తెరుద్దాం. అదృష్టం బాగుంటే పదేళ్లు తిరిగేసరికి మనం మిలియనీర్స్ అయిపోవచ్చు." అన్నాడు,

ఆ మాటలకు విస్పష్టంగా నవ్వాడు తను — "నీ ఐడియా బాగానే వుంది చిన్న టీ స్టాల్ పెట్టాలంటే కనీసం రెండుమూడు వందలు మదుపు వుండాలి. టీ త్రాగడానికయినా డబ్బు ల్లేనివాళ్ళు టీస్టాల్ ఎలా పెట్టగలరు గురూ?"

విసుక్కున్నాడు వరదరాజన్.

"అబ్బబ్బ! అలాంటి ప్రశ్నలు అగొద్దు వాటన్నిటికీ కాలమే సమాధానం చెబుతుంది. ఇవాళే మనం దర్జాగా పాస్మెంటు మెంబరు హోదాలో (టికెట్ లేకుండా) తిరుపతి వెళ్ళిపోదాం. ఆ పైన వెంకటేశ్వరు డున్నాడు." బీడీ చివరిదమ్ము లాగుతూ హుషారుగా అంటున్నాడు వరదరాజన్.

రెండు రోజులబట్టీ తిండి సరిగ్గా లేకపోయినా — అదృష్టమనే పదార్థం కనుచూపు మేరలో కనబడే అవకాశం లేకపోయినా — ఆ అదృష్టాన్ని అన్వేషించడం మానదలుచుకోలేదు వరదరాజన్. ఏదో పట్టుదలనూ, ధృఢ సంకల్పాన్నీ తెలిపే మహత్తరశక్తి అతడికళ్ళల్లో ప్రకాశించిం దారోజు.

ఎదురింటి పాప నీటిలో కాగితపు పడవలు వదులుతోంది. వర్షం ధాటికి ఆగలేక పడవలు కొద్దిదూరం ప్రయాణం చేసి మునిగిపోతున్నాయి. అయినా — పాప, కాగితపు పడవలు వదలడం మానలేదు. చివరికి — ఓ పడవ వర్షాన్ని తప్పించుకుని చూరును ఆనుకుని ప్రయాణం చేసి చాలాదూరం పోయింది. ఆనందంతో చప్పట్లు చరిచింది పాప


నవ్వుతూ భుజం తడుతూ అన్నాడు వరదరాజన్.

"అదీ పట్టుదలంటే —"

ఆ నవ్వు తన కింకా జ్ఞాపకముంది.

తనమీద తనకు గల నమ్మకం — విధి మనిషి చేతిలో కీలుబొమ్మని బుజువు చెయ్యగల ననే విశ్వాసం — జీవితానికి భయపడితే ఎలాగోయ్ — అన్న ఓదార్పు ఆనాటి వరదరాజన్ నవ్వులో గోచరమయ్యాయి...

వర్షం బాగా ఎక్కువౌతూంది. ఉరుముల అలజడి ఎక్కువయింది.




హఠాత్తుగా ఎలక్ట్రిసిటీ పోయింది.

కొవ్వొత్తులు తీసుకుని నౌకరు గంగులు వచ్చాడు.

కొవ్వొత్తి టేబిల్ మీద పెడుతూ అన్నాడు గంగులు.

"డాక్టర్ బాబు ఫోన్ చేశారండి ఏటి బొమ్మేదో గీయించాలన్నారట గదండి! ఎవరో పెయింటర్ బాబుగారు అన్నారుటండి – రేపు పొద్దున్న పంపిస్తా అని చెప్పమన్నారండి"

"ఊఁ!"

భారంగా మూలుగుతూ కళ్ళు మూసుకున్నారు రంగధామరావుగారు.

* * *

పొద్దున్న వరండాలో పేపరు చదువుకుంటున్న రంగధామరావుగారితో అంది రోజారాణి

"నాన్నా! నాన్నా! ఈ ఫోటో బాగుందికదూ? నీ డ్రాయర్ లో వుంది."

మామూలుగా అటుతిరిగిన రంగధామరావుగారు రోజా చేతులోవున్న ఫోటో ఎవరిదో తెలుసుకోగానే క్షణకాలం నిశ్చేష్టు డయ్యాడు.

తడబడుతూ అన్నాడాయన.

"అఁ! అఁ! ఆఫోటో నీ కెక్కడ ఇలా యిచ్చెయి."

అంతత్వరగా మాటవినే అమ్మాయా రోజారాణి?

"ఉహుం! నే నివ్వను. ఇంచక్కా చాలా బావుంది. ఆల్బమ్‌లో పెట్టుకొంటాను." అంటూ పరుగుతీసింది.

ఈ మాటలకు ఖంగారుపడిన రంగధామరావుగారు ఫోటో లాక్కుంటూ, రోజారాణిని కోపంతో కొట్టారు.

"అమ్మా చూడు — నాన్న నన్ను కొట్టేస్తున్నాడు," అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయింది రోజారాణి

రోజారాణి ఏడుస్తుంటే రంగధామరావుగారి గుండెల్లో కెలికినట్లయ్యింది. ఇంతవరకూ తను ఏనాడూ రోజాపై చేయి చేసుకుని ఎరుగడు. అలాంటిది ఇవ్వాళ ఎంతపని జరిగింది? తను ఎంతబాధ పెట్టాడు రోజాని? బాధతో నిట్టూర్చాడాయన

రోజా పడేసిన ఫోటోను తీసుకుంటూ నిశితంగా చూశాడాయన.

అందంగా నవ్వుతోంది ఎంకి.

హోటల్‌కివచ్చి కాలేజీ స్టూడెంటు దగ్గిర ఎంకిపాట నేర్చుకుని పాడితే ఎంత మురిసిపోయింది తను?

"యెంకివొంటి పిల్ల లేదోయి లేదోయి
యెంకి నా వొకింక రాదోయి రాదోయి
మెళ్ళో పూసలపేరు
తల్లో పూవుల సేరు
కళ్ళెత్తితేసాలు కనకాబిసేకాలు
పదము పాడిందంటె
పాపాలు పోవాల
కతలు సెప్పిందంటె
కలకాలముండాల
రాన్నో రింటకైన
రంగు [illegible]చ్చే పిల్ల
నానోముల్మ నాగుండె
నమిలిమింగిన పిల్ల!"

అంటూ తను పాడితే —

"పాటలు బలే పాడుతున్నావే రంగయమావా!" అంటూ కలకలా నవ్వేది ఎంకి ఎంకి అలా నవ్వుతున్నప్పుడు మంత్తెక్కించే ఆమె వొంపులు వయ్యారంగా కదిలేవి

అందమైన ఎంకి నవ్వుకోసం ఎంత పరితపించి పోయేవాడో తను? ఎంకి నవ్వితే తన గుండెల్లో అమృతాలు చిలికేవి

మరోసారి రంగధామరావు స్మృతి పథంలో తిరుపతిలో గడిపిన జీవితం అలలాగా మెదిలింది.

"రంగయ్యమావా? రోజు రోజుకీ యిడ్లీ ధర పెంచేస్తున్నారు. లాభాలు చాలడంలేదేటి?"

ఇడ్లీపిండి రుబ్బుతూ అనేది ఎంకి

"ధర పెంచడం లాభాలకోసం కాదు. నష్టం రాకుండా వుండటంకోసం. అయినా — ఈ వ్యాపారంలో మిగిలేదేముంది? శ్రమ తప్పితేనూ—" మధ్యలో అందుకొనేవాడు వరదరాజన్.

పిండి గిన్నెలోకి తీస్తూ నవ్వుతూ అనేది ఎంకి.

"షావుకారు వనిపింనావు రాజయ్యా!




ఎంతయినా నీపాటి గడుసుతనంలేదు ఈ రంగయ్యకి. ఎప్పుడూ ఆ కవుంటర్ కాడ కూకుని డబ్బులు లెక్కపెట్టమంటే పెడతాడు అంతే."

సిగరెట్ పొగ షోగ్గా వదులుతూ అనేవాడు వరదరాజన్

"ఏమోనే ఆడి పద్ధతే వేరు. కూటికి లేకపోయినా దొరబాబులాగా వుంటాడు. వీడి ముఖం చూస్తూంటే ఎక్కడో సిరి రాసిపెట్టినట్టే వుంటుంది "

"ఆఁ! - ఆఁ! - రాశాడు, రాశాడు - సాంబారు గరిటమీద." గలగలా నవ్వేది ఎంకి.

ఎంత హాయిగా నవ్వుతుంది ఎంకి ?- ఆరోజుల్లో తనకి కోరికలేమన్నా వుంటే- అది, అందమైన ఎంకి నవ్వు తనకు స్వంతఆస్థి కావాలనే...

వెంకటేశ్వరస్వామిని దర్శించినప్పుడల్లా ప్రార్థించేవాడు తను.

"భగవాన్ ! నాకీ జీవితంలో ఏ

మిచ్చినా యివ్వకపోయినా, జీవితాంతం భాగస్వామినిగా ఎంకిని మాత్రం ప్రసాదించు," అని.

హోటలు అభివృద్ధికోసం తను అహర్నిశలూ కృషి చేశాడు. లాభాలలో హోటల్ తులతూగుతుంటే మురిసిపోయాడు. అయితే, ఈ కృషి వెనుక వున్నది ధనాపేక్ష మాత్రమే కాదు; మరొక బలవత్తరమైన కారణం కూడా.

"చూస్తూ చూస్తూండగానే చెట్టుకింద టీ దుకాణం కేంటిన్ అయిపోయింది. కేంటిన్ కాఫీహోటల్ అయిపోయింది. మరికొన్నాళ్లు పోతే, లాడ్జింగు కూడా పెట్టేట్టున్నారే? ఎలా గయినా, నీ బుర్ర గొప్పదయ్యోవ్" అని ఎంకి అంటున్నప్పుడు తన గుండెల్లో వెచ్చటి అనుభూతి కలిగింది. నిండుగా నవ్వుకున్నాడు. ఆ నవ్వు తన కింకా జ్ఞాపకముంది. జీవిత సోపానాలు ఎక్కుతున్నానన్న ఆనందం, తీరని కోరికలు అంతబోతున్నా యన్న ఉత్సాహం ఆనాటి తన నవ్వులో ప్రతిబింబించాయి. ఇంకా చాలా చెయ్యబోతాను చూడు— అన్న హెచ్చరికా, నే నంటే ఏమిటనుకున్నావ్ మరి— అన్న గర్వమూ ఆనాటి తన నవ్వులో లాస్యమాడాయి.

భారంగా నిట్టూర్చారు రంగధామరావుగారు.

ఆనాడు తను ఎన్ని పసిడి కలలు కనేవాడు? భవిష్యత్ జీవితంలోని ఆనందాన్ని ఎంత అందంగా ఊహించుకొనేవాడు? ఈ హోటల్ దేవేంద్ర భవనమై పోతుందనీ, ఆ భవనంలో ఇంద్రుడు తానై, ఎంకి శచీదేవి అవుతుందనీ ఎన్నెన్ని అందాల స్వప్నాలు కనేవాడు తను? కాని చివరకు జరిగిందేమిటి? తన మూలంగా ఎంకి బ్రతుకేమైంది?

బాధగా కణతలు పట్టుకొన్నారు రంగధామరావుగారు.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది.

గతస్మృతుల వలయాలలోంచి ఇవతలకు వచ్చిన రంగధామరావుగారు ఫోటోను తన సొరుగులో పెట్టి తాళం వేశాడు. నిన్నరాత్రి పొరబాటున తాళం వేయడం మరచిపోయినందున జరిగిన పరిణామానికి యిప్పటికీ బాధ పడుతున్నాడు తను.

ఫోన్ ఎత్తిన రంగధామరావుగారికి క్షణకాలం మాటలు పెగలలేదు. నెత్తిమీద పిడుగులు పడ్డట్టయ్యింది.

"కృష్ణాపురం దగ్గిర కడుతున్న ఓవర్‌బ్రిడ్జీ కూలిపోయింది. నలభై మంది కూలీలకి ప్రమాదకరమైన గాయాలు తగిలాయి."

అవతలినించి చీఫ్‌యింజనీయర్ మాట్లాడుతున్నాడు.

* * *

హుటాహుటిని కృష్ణాపురం బయలుదేరి వెళ్ళిన రంగధామరావుగారికి కూలి

పోయిన ఓవర్ బ్రిడ్జీ, ధ్వంసమైపోయిన ఏడాది శ్రమా వెక్కిరిస్తూ కనబడ్డాయి.

ఎంతడబ్బు నష్టం? యిప్పుడు మళ్ళీ బ్రిడ్జి కట్టి ప్రభుత్వానికి అప్పజెప్పాలన్నా కూడా వ్యవధి లేదు. ఏం చేయాలి తను?

కంట్రాక్టు వ్యాపారం ప్రారంభించాక యిన్నాళ్ళూ లాభాలనే కాని, నష్టాన్ని చవిచూడని రంగధామరావుగారికి ఈ సంఘటన అంతులేని ఆవేదనను రగుల్కొలిపింది.

కూలిపోయిన బ్రిడ్జీనీ, చెల్లాచెదరయి పోయిన పనివారినీ చూస్తే ఆయన కళ్ళల్లో నీళ్ళు కదలాడాయి.

ఆ కన్నీటిలో ఆయనకు వరదరాజన్ కనబడ్డాడు.

శిధిలమైపోయిన కట్టడం మీద నిల బడి వికటట్టాహాసం చేస్తున్నాడు వరద రాజన్.

"ఒకనాడు ఈ బ్రిడ్జీలాగానే నా ఆశలు కూలిపోయాయి - తుత్తునియలై, చెల్లాచెదరై పోయాయి. ఆనాడు నా ఆశల్ని కూల్చింది నువ్వు. నా జీవితాన్ని అంధకారకుహరంలోకి త్రోసింది నువ్వు. ఆ పాపఫలితాన్ని నువ్వు అనుభవించక తప్పదు. భగవంతుడు పాపాలకు పరి హారాన్ని యిస్తాడని నాకు నమ్మకం లేదు. భగవంతుడుకూడా దుర్మార్గుల లంచాలకు దాసుడు. అందుచేతే నిన్ను నేను వెదుక్కుంటూ వచ్చాను; మూసుకు పోయిన నీ కళ్ళు తెరిపించి, నీలో చోటు చేసుకున్నాను. నువ్వు తెరిచిన కళ్ళు ఇక వించీ యిలాంటి పండగల్నే కనువి దుగా చూస్తాయి. ఈ బ్రిడ్జియే కాదు నువ్వూ నీ కుటుంబం, నీ ఆస్తిపాస్తు అన్నీ శిధిలమైపోవాలి. ఆనాడే నా ఆత్మకు శాంతి"

భీకరంగా నవ్వుతున్నాడు వరద రాజన్.

భయంతో కళ్ళు మూసుకున్నాడు రంగధామరావు

"కళ్ళు మూసుకున్నంత మాత్రాన నన్ను తప్పించుకోలేవు మిస్టర్ రంగ ధామరావు. లోపలకూడా నేనే వున్నాను అంతేకాదు, నీ ప్రతి కదలికలోనూ వున్నాను - నీ దురదృష్టాన్ని."

విషపునవ్వు నవ్వుతున్నాడు వరద రాజన్.

కాసేపు యింజనీర్లతో, పార్ట్‌నర్లతో మాట్లాడి కారులో ఎక్కి కూర్చున్నారు రంగధామరావుగారు.

కారు కదులుతోంది. చల్లగాలి హాయిగా గుండెలకు తగులుతోంది. అయినా, రంగధామరావుగారి గుండెల్లో గుబులూ, వేడీ పోవటంలేదు. వరద రాజన్ మాటలు అయన హృదయంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆనాడు జైలు కెడుతూ అన్నాడు:

"రంగా! నువ్వు నా ప్రాణంలో ప్రాణమైన మిత్రుడవని నమ్మాను. నీలో ఎంతో ఆత్మీయతను, ఆప్యాయ

తను ఊహించుకున్నాను. కాని ను వ్వింత నీతివిహీనుడ వనుకోలేదు. నీ దుర్మార్గం తెలిసినా, నీ నీచత్వం బయట పడినా, నేను ని న్నేమీ చేయలేక పోయాను. ఆ శిక్షేదో నాకు నేనే విధించు కున్నాను. సగం కాలిన నా ఆశల్ని పూర్తిగా తగలబెట్టేశాను; ఆ బూడిదలో కలిసి మసై పోయాను. బూడిదై పోయిన నా జీవితం మీద నువ్వు సుందర హర్మ్యాలు నిర్మించుకున్నా, నువ్వు అందులో ఆనందాన్ని అనుభవించలేవు. చేసిన పాపం నిన్ను వెంబడిస్తూంటే, నీ శరీరంలోని ప్రతి అంగుళమూ పశ్చా త్తాపంతో దహించుకుపోతూంటే నీ పాపాన్ని పైకి చెప్పుకోలేక నీలో జీర్ణించుకోలేక యమయాతన అనుభ విస్తావు. ఆ బాధతోనే అంతమౌతావ్. నా కదే కావాలి. నా కదొక్కటే కావాలి." ఆ మాటల్లోని ఆవేశం కరుకు తనం తన కింకా జ్ఞాపకం వున్నాయి. ఆ కళ్ళల్లోని ప్రతీకారజ్వాల తన కింకా కనబడుతూనేవుంది.

నాటికి నేడు వరదరాజన్ తనపై పగ తీర్చుకున్నాడు. వెలుగు నిస్తాననే నెపంతో తనకి లోకాన్ని చీకటి చేస్తు న్నాడు. చీకటిలో కృంగి కృశించమని శపిస్తున్నాడు.

బాధగా కళ్లు మూసుకున్నాడు రంగ ధామరావుగారు.

'అయితే, యిక జరగబోయేదేమిటి? ఈ కళ్ళతో తను చూడబోయే ఘోర కృత్యాలు మరేమిటి?' భయంతో ఆయన గుండెలు స్పందించాయి.

తన వ్యాపారం నాశనమైపోతుంది. తన కుటుంబం చెల్లాచెదరై పోతుంది. తన జీవితం బూడిదై పోతుంది. గుండె ల్లోంచి ఎవరో అరుస్తున్నారు.

చేతుల్తో గుండెల్ని అదుముకుంటూ—

"భగవాన్! ఏమి టీ వైపరీత్యం?" అని గొణుక్కున్నా డాయన తడబడే గొంతుకతో.

* * *

మేడమెట్లెక్కుతున్న రంగధామ రావుగారిని చూస్తూనే అన్నాడు డాక్టర్ గిరిధర్.

"టుడే ఈజ్ రియల్లీ ఏ గుడ్ డే— మా స్వర్గంలోకి రమ్మంటూ ఎంతమంది గంధర్వులను పంపించినా రాని మీరు— ఈరోజు మీ అంతట మీరే రావటం అన్నది — ఓహ్ — చాలా గొప్ప విషయం."

మాటల సందడికి కళ్ళు తెరిచిన డి. యస్. పి రాజు:

"ఓహ్! మిస్టర్ రావ్! నువ్వటోయ్! నువ్వూ వచ్చేశావూ మా దగ్గరకి? నాకు తెలుసు— ఎప్పుడో ఒకప్పుడు నువ్వు రాక తప్పదని. నువ్వేకాదు, మనిషయి పుట్టిన ప్రతివాడూ యిక్కడికి రావా ల్సిందే. త్రాగలేని గాడిద బ్రతు కెందు కోయ్? కమాన్," అన్నాడు.



డాక్టర్ గిరిధరరావుగారి మేడమీది డ్రాయింగ్ రూమ్‌లో త్రాగి తందనా లాడుతున్న భక్తు లందరినీ చూచి — భారంగా నిశ్వశిస్తూ — అన్నాడు రంగధామరావుగారు.

"నే నిక్కడికి త్రాగడానికి రాలేదు."

"మరి?" అన్నాడు బిజినెస్ మాగ్నెట్ సోమసుందరం, అమృతాన్ని గ్లాస్‌లోకి పోసుకుంటూ.

"మీతో మాట్లాడ్డానికి వచ్చాను. మీ రొక్కసారి యిలా రావాలి," అంటూ డాక్టర్ గిరిధర్‌ని చెయ్యి పట్టుకు తీసుకు పోయాడు రంగధామరావుగారు.

కన్సల్టింగ్ రూమ్‌లో లైట్ వేస్తూ అన్నాడు గిరిధర్:

"ఏమిటిది మిస్టర్ రావ్? ఏమి టీ హడావిడి? ఈ అర్ధరాత్రిపూట మీకొచ్చిన సందేహం ఏమిటి? కొంపదీసి వైన్‌కి నంచుకూడా వుండాలంటా రేమిటి?"

జోక్ చేస్తున్నాడు డాక్టర్.

కుర్చీలోకూర్చుని సిగరెట్ ముట్టిస్తూ అన్నారు రంగధామరావుగారు.

"మీరు నాకో సహాయం చేసి పెట్టాలి."

"ఏమిటి? ఏమన్నా సర్టిఫికేట్ కావాలా?" అన్నాడు డాక్టర్ మామూలుగా.

తడబడే గొంతుకతో అన్నారు రంగధామరావుగారు:

"నాక్కావలసింది సర్టిఫికేట్ కాదు; మనశ్శాంతి. అది మీ రివ్వగలరనే నమ్మకంతోనే యిక్కడి కొచ్చాను."

తేలిగ్గా నవ్వాడు డాక్టర్.

"లక్షల్లో మునిగితేలే మీకు నే నివ్వ

గల మనశ్శాంతి ఏమిటి? అయినా, ఆ యిచ్చే మనశ్శాంతి ఏదో ప్రొద్దునకూడా యివ్వగలనుగా — ఈ అర్ధరాత్రి పూట..."

బాధతో అన్నారు రంగధామరావు గారు: "ప్లీజ్! అస్తమానూ ఆ మాట వాడకండి. నిజం — ఇది అర్ధరాత్రి. కాని — ఇది మీకు. నాకు రాత్రీ, పగలూ అన్నీ ఒకలాగే వున్నాయి. కళ్ళు మూసుకున్నా తెరచినా ఏదో భయం విలయతాండవం చేస్తోంది. ఆ భయంతో నేను భస్మమైపోతున్నాను. డాక్టర్! — మీరు నన్ను కాపాడాలి. ఈ యమయాతనను నేను భరించలేను డాక్టర్!"

సాలోచనగా భృకుటి ముడిచి—

"మీ రేదో చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నట్టుంది. చెప్పండి, విషయమేమిటో," అన్నాడు డాక్టర్ సిగరెట్ ముట్టిస్తూ.

గంభీరంగా అన్నారు రంగధామరావుగారు:

"మీ రెలాగయినా నా కళ్ళు పీకెయ్యాలి డాక్టర్..."

అది విని, "వ్హాట్?" అన్నాడు డాక్టర్ అదిరిపడుతూ.

"అవును డాక్టర్! చీకట్లోవున్నపుడే నా కెంతో హాయిగా వుంది. నే నిప్పుడీ వెలుగును భరించలేకపోతున్నాను. ఈ వెలుతురులో నాకు భయం, బాధా, భీభత్సం కనబడుతున్నాయి. మిమ్మల్ని బ్రతిమాలుకుంటాను డాక్టర్! నా కళ్ళు పీకెయ్యండి. నాకు నేనే ఈ పని చేసుకుందా మనుకున్నాను — కారు వేగంగా డ్రయివ్ చేసుకుంటూ వెళ్ళి ఏ చెట్టుకో గుద్దిద్దా మనుకున్నాను. కాని, ఆ ప్రమాదంలో ఏ కాలో, చెయ్యో విరిగి, చివరకు మళ్ళీ ఈ కళ్ళు మిగులుతాయని భయం వేసింది. అదీకాక, నన్ను బెదిరిస్తూ నా ప్రాణాలు తింటున్న ఈ యింద్రియాలపై మమకారాన్ని చంపుకోలేకపోతున్నాను. ఏదో తెలియని పిరికితనం, బలహీనతా నన్ను బానిసగా చేస్తున్నాయి. నన్ను మీరే రక్షించాలి డాక్టర్!"

ఈ మాటలు విని భళ్ళున నవ్వాడు డాక్టర్, సిగరెట్ నుసిని ఏష్‌ట్రేలో వేస్తూ.

"ప్రాక్టికల్ జోక్ చాలా బాగుంది రంగధామరావుగారూ! ఇవ్వాళ ఏప్రెల్ ఫస్ట్ కాదే."

రంగధామరావుగారి కీమాటలు బాధని కలిగించాయి. ఆయనకు డాక్టర్‌మీద కోపం వచ్చిందికూడా.

భృకుటి ముడిచి గంభీరంగా అన్నాడాయన:

"నేను చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాను."

తేలిగ్గా నవ్వాడు డాక్టర్!

"ఓ యస్. నేనూ చాలా సీరియస్‌గానే మాట్లాడుతున్నాను. మీ కొ్కావలి

సిన మందులూ, టానిక్‌లూ ఈ క్రింద లేవు. అవన్నీ మేడమీద స్వర్గ లోకంలో వున్నాయి - కమాన్." అంటూ రంగధామరావుగారిని లాక్కు పోయాడు డాక్టర్

రంగధామరావుగారికి ఏమనాలో తెలియలేదు. గిరిధర్, రెండు చేతులూ పట్టుకొని ఈడ్చుకుపోతున్నాడు తనని.

మేడమీది కొచ్చిన డాక్టర్‌నీ, రంగ ధామరావుగారినీ చూస్తూ అన్నాడు సోమసుందరం.

"హలో డాక్టర్! నీ పేషెంట్‌కి ట్రీట్‌మెంట్ చేసేశావా?"

"ఇప్పు డాయనకు నేను ట్రీట్‌మింట్ చేసే స్థితిలో లేను. ఆయనే నాకు ట్రీట్‌మెంట్ చెయ్యబోయాడు." నవ్వుతూ అన్నాడు గిరిధర్.

ఫల్లున నవ్వాడు డి.యస్‌పి. రాజు: "నాకు తెలుసు డాక్టర్. రంగధామ రావంటే దేవాంతకుడు. అయామ్ సారీ! స్వర్గలోకంలో వున్నాంగా. దేవతల్ని తిట్టకూడదు పోనీ నరాంతకుడు. ఎలా వుంది మన ఉపమానం?"

ఇవేమీ పట్టించుకోనట్టుగా సోమ సుందరం. "ఇంతకీ ఏమంటాడోయ్ నీ పేషంటు?" అన్నాడు మరో పెగ్ పట్టిస్తూ.

రంగధామరావుగారి వైపు చూచి, చిరునవ్వుతో అన్నాడు డాక్టర్: "కంటికి చూపురావడంవల్ల ఆయనకు ప్రయోజనం కనబడటం లేదు. కళ్ళకి ఆపరేషన్ జరగనప్పుడే ఆయనకు హాయిగా వుందిట"

భయంకరంగా విరగబడి నవ్వాడు సోమసుందరం. "అమృతం పడకుం డానే దేవతల మాటలు వచ్చేస్తున్నాయి రంగధామరావుగారికి. ఇప్పటికి సీసా ఖాళీ చేశాను. ఏదీ? నా కా గీర్వాణ భాష రాందే? ఇంకా నా కళ్ళముందు ఆ పాడు ఇన్‌కమ్‌టాక్స్ ఎకవుంట్‌లే కనబడుతున్నాయి. మంచినీళ్ళు తాగినా నిషా వచ్చేస్తుంది నీకు - అదృష్ట జాత కుడివోయ్."

ఇందాకటినించీ కోపాన్ని అణచు కున్న రంగధామరావుగారు యిక వట్ట లేకపోయారు.

"సోమసుందరం!" అన్నా డాయన ఉద్రేకంతో.

డాక్టర్ అడ్డుపడ్డాడు. "ఉష్! వాడి తాగుబోతు మాటలు పట్టించుకోకండి రావుగారూ! కా స్త మందు పుచ్చుకోండి. ఎక్కడి బాధలు అక్కడికి పోతాయి." అంటూ గ్లాసులో ఔషధాన్ని వేసి అందిం చాడు డాక్టర్.

వైన్ అందుకుంటున్న రంగధామ రావుగారికి గ్లాసులో ఎంకి రూపం కన బడింది.

"తాగనవి ఒట్టేసుకున్నావ్? అప్పుడే మొదలెట్టా? అప్పుల్లే నీ కిపుడు ఎంకి ఎందుకు జ్ఞాపక ముంటుందీ?

కాఫీ హోటలల్లా లాడ్జింగు హోటలయి పోయిందిగా – జేబునిండా డబ్బే. ఇక, మరి దృష్టంతా ఆ పాడు అలవాట్లమీదే వుంటుంది. డబ్బు గణించడం గొప్ప కాదు; నిలబెట్టుకోవడం గొప్ప. త్రాగి తందనాలాడి యిల్లూ, వళ్ళూ గుల్ల చేసుకోకు రంగా. ఏదీ నామీద ఒట్టెయ్యి. యీసారి తప్పకూడదు మరి."

బాధగా కళ్ళు మూసుకున్నాడు రంగధామరావుగారు. నిజం. ఎంకి తనమీద ఎన్నో ఆశలు పెట్టుకొంది. తన అభివృద్ధిని అహర్నిశలూ వాంఛించింది. కానీ తానే ఆమెకు అన్యాయం చేశాడు. ఆమె ఆశాలతను త్రుంచివేశాడు.

"కళ్ళు మూసుకుని త్రాగుతావేమిటోయ్ – చంటిపిల్లాడు మందు త్రాగినట్టు. డాక్టర్ మందన్నాడు కదా అని, నిజంగా మందు అనుకుంటున్నావేమిటి ఖర్మం? అయినా మంచినీ, చెడునూ, రెండింటినీ చూడగల ధైర్యం తెచ్చుకోవాలోయ్. కళ్ళు మూసుకుంటే ప్రపంచం ఏం కనబడుతుంది? 'సర్వాంగేషు నయనం ప్రధానం' అన్నారు. అది మూసుకోకు నాయనా! తప్పు!" నీతులు చెబుతున్నాడు, సోమసుందరం ఫుల్ దోస్‌లో వుండి.

సోమసుందరం త్రాగుబోతు మాటల్లో పరమజ్ఞానం వినబడింది రంగధామరావుకు. నిజమే. నయనాలే మనిషికి ప్రధానం. మనిషి జీవితాన్ని వెలుగుగా గాని, చీకటిగాగాని మార్చేవి నేత్రాలే. అలాంటి నేత్రాలే మనిషిమీద పగబట్టినప్పుడు – ఆ నేత్రాలే పనిగట్టుకుని మనిషి జీవితంలో చీకటిని గ్రుమ్మరిస్తున్నప్పుడు – నీకు కనబడే ప్రపంచమంతా దురదృష్టంతో భగ్గున మండా లనిపిస్తున్నప్పుడు...

రంగధామరావుగారి గుండెల్లో భయ భీభత్సాలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుండెలు వేగంగా కొట్టుకొని హృదయనాళాల్లోని రక్తాన్ని వెచ్చగా మారుస్తున్నాయి.

'ఛీఛీ! ఎందుకిలా పిరికివాణ్ణయిపోతున్నాను? ఏమిటి నాలోని బలహీనత?" అస్పష్టంగా గొణుక్కున్నాడాయన.

దూరంగా పిడుగుపడింది. మళ్ళీ వర్షం ప్రారంభమైంది.

వర్షపుచినుకులు బాల్కనీలో పడుతూ శబ్దాన్ని చేస్తున్నాయి.


"రంభా ఊర్వశీ వచ్చేరు. గజ్జెల చప్పుడు వినబడుతోంది. స్వర్గలోకంలోని ఆనందాన్ని జుర్రుకుందాం రండర్రోయ్–"

అరుస్తున్నాడు సోమసుందరం.

* * *

రంగధామరావుగారు యింటికి తిరిగొచ్చేసరికి రాత్రి పన్నెండు దాటింది.

బట్టలు మార్చుకొనేందుకు మేడమేది గదిలోకి వెళ్ళబోతున్న రంగధామరావుగారు బెడ్‌రూమ్‌వైపు ఒకసారి చూశారు.




భార్యా. రోజీ ప్రశాంతంగా నిద్ర పోతున్నారు.

అమాయకంగా తల్లిని కౌగలించు కొని నిద్రపోతోంది రోజీ.

ఆప్యాయంగా రోజీ బుగ్గలమీద నిమిరాడు తండ్రి.

ప్రొద్దున్న ఎంత క్రూరంగా కొట్టాడు తను? భారంగా విట్టూర్చా డాయన.

మొట్టమొదటిసారిగా రోజీని కొట్టాడు తను. గులాబీరేకుల్లాంటి ముద్దులపాప చెక్కిళ్ళపై కన్నీళ్ళు తెప్పించాడు.

నిజం. తను మారిపోతున్నాడు.

పదిహేనేళ్ళుగా మానేసిన మదిరను ఈనాడు తనివిదీరా సేవించాడు.

ఎందుకు తనలో యిలాంటి మార్పు వస్తోంది?

'ఇంకా అర్థం కాలేదా రంగధామరావ్? నీలో మార్పుకు కారణాన్ని నేను. నీ అధఃపతనానికి కారణభూతుణ్ణి నేను; నేను నీలో ఏనాడు ప్రవేశించానో, ఆనాడే నీ జీవితానికి చరమాంకం ప్రారంభమైంది. నువ్విప్పుడు వినాశనానికి చాలాదగ్గర్లో వున్నావు రంగధామరావ్.'

గుండెల్లోంచి ఓ రాక్షసగొంతు వినబడింది.

భయంతో రంగధామరావుగారి ఒళ్ళు కంపించింది.

కన్నీళ్ళు తిరిగే కళ్ళతో తన ప్రతిబింబాన్ని అద్దంలో చూచుకొన్నాడు.

యాంత్రికంగా వరదరాజన్ కళ్ళు కన్నీళ్ళు కారుస్తున్నాయి. ఎర్రగా మండుతూ చింతనిప్పుల్లా వున్న ఆ కళ్ళు రంగధామరావుగారిని మరింత భయపెడుతున్నాయి.

"వరదరాజన్! నామీద నీ కెందు

కింతపగ? ప్రాణంలో ప్రాణంగా ప్రేమిం చానే? నన్ను క్షమించలేవూ?" జాలిగా ప్రాధేయపడుతూ తనలో తను గొణు క్కున్నాడు రంగధామరావు.

ఆ మాట విని కాబోలు –

" 'క్షమ' – ఎంత తేలిగ్గా అడగ్గలి గావ్? నిజానికి అడగ్గల అర్హత వుందా నీకు?" వరదరాజన్ గొంతు గర్జించింది.

"ఏం? ఎందుకులేదు? తెలిసి, కావా లని, నే నేం తప్పు చేశాను?" ఎదురు తిరిగాడు రంగధామరావు.

"నిన్ను నమ్మిన నన్ను అన్యాయం చేశావ్. వేలకువేలు గణించి లక్షాధికారి కావాల్సిన నన్ను జైలుకి పంపావు. నిండుహృదయంతో మనుష్యుల్ని ప్రేమిం చడమే కాని – ద్వేషించడం తెలియని నన్ను హంతకుణ్ణి చేశావు.''

"నేనా? ఆ బాధ్యత నాదా? ఆ హత్య చేసింది నువ్వుకాదూ?'' గుండెలు తడుముకొంటూ అన్నాడు రంగధామ రావు.

"కావచ్చు. కాని, ఎవర్ని చేశాను హత్య? నేను కట్టుకున్న గాలిమేడల్లో విహరించే అందాల ఆశల సౌందర్య మూర్తిని – నా రెండోప్రాణాన్ని హత్య చేశాను. ఎందుకు? ఎందుకు చేశా నీ అమానుషకృత్యాన్ని?''

ఆ మాటలకు తడబడుతూ అన్నాడు రంగధామరావు:

"నీమాటలకు అర్థంలేదు. నీకు విచక్షణాశక్తిలేదు. స్వార్థరాహిత్యానికి లభించేది విరోధమా? త్యాగానికి ప్రతి ఫలం క్రోధమా?''

ఫక్కున నవ్వింది వరదరాజన్ గొంతు: "ఏమిటి నువ్వు చేసిన త్యాగం?''

"నాసర్వస్వమూ అనుకొని ప్రేమించిన ఎంకిని నీకోసం వదులుకొన్నాను. నువ్వు ఆమెమీద మోజుపడుతున్నావని తెలియ గానే – నా ఆశలు చంపుకొని నువ్వామెను వివాహం చేసుకోడానికి అంగీక రించాను.''

వెటకారంగా అంది వరదరాజన్ గొంతు: "ఓహో! ఐతే, త్యాగమూర్తీ! ఇంత త్యాగం చేసినవాడివి ఆమెపై మమకారాన్ని పూర్తిగా ఎందుకు వదులుకోలేకపోయావు? సమాజంలో నాభార్యగా ముద్ర వేయబడిన స్త్రీపై కోర్కెలు ఎందుకు చంపుకోలేక పోయావు?"

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం రంగధామరావుగారికి కష్టసాధ్యమే అయింది. జవాబు చెప్పలేని ఆయన పెదాలు మూగగా కదలాడాయి.

రంగధామరావుగారి బలహీనతను అసరాగా తీసుకుని అంతరాత్మ ఎదురు తిరిగింది.

"నువ్వు సమాధానం చెప్పలేవు. నాకు తెలుసు. విధి అనీ, బలహీనత

అవీ సాకులు చెప్పి తప్పించుకుందా మనుకోకు రంగధామరావ్! ఎంకితో పాతసంబంధం వదులుకోలేని నువ్వు, ఆమె నీ స్నేహితుడి భార్య అని తెలిసి కూడా, అక్రమసంబంధాన్ని పెట్టుకున్నావు. విషయం తెలిసిన వరదరాజన్ ఉగ్రుడై, ఎంకిని హత్య చేశాడు. నీ అదృష్టం బాగున్నందున ఆరోజు నువ్వు వరదరాజన్ కంటబడకుండా తప్పించుకుపోగలిగావు. వరదరాజన్ అరెస్టయ్యాడు. న్యాయస్థానం అతనికి పదేళ్లశిక్ష వేసింది. వరదరాజన్ లేని సమయం చూచి – హోటల్ మూసివేసి – చేతికందిన ఆస్తిపాస్తులు పట్టుకొని ఉడాయించావు నువ్వు. నేటికి ఈ వూరికి ఘనుడవై పెద్దమనిషిగా చలామణీ అవుతున్నావు. లక్షాధికారి కావల్సిన వరదరాజన్ జైలుపాలై చివరకు హోటల్ సర్వర్‌గా తన జీవితాన్ని పరిసమాప్తి చేసుకున్నాడు. నువ్వు మోసాలూ, దుర్మార్గాలూ చేస్తునే వున్నావు. బీదవాడైనా తన విశాల హృదయాన్ని విడనాడక తనకు మిగిలిన కళ్లుకూడా దానం చేసి చచ్చిపోయాడు వరదరాజన్. ఆ కళ్ళే చివరకు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చుకొన్నాయి. నీలో చోటు చేసుకుని నీ జీవితాన్ని అంధకారం చేయబోతున్నాయి. అంతేనా మిస్టర్ రంగధామరావు?"

సమాధానం చెప్పలేని రంగధామరావుగారు కణతలు పట్టుకొంటూ కుర్చీలో కూలబడ్డారు.

పైన ఫేన్ తిరుగుతోంది. అయినా ఆయన వళ్ళంతా స్వేదమయమై పోతున్నది.

గుండెల్లో అంతరాత్మ మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఏదో తెలియని భీతి వికటట్టాహాసం చేస్తోంది.

"నువ్వు చూచే ప్రతి వస్తువులోనూ నీకు దురదృష్టం కనబడుతుంది. నీకు ప్రపంచమే వక్రంగా కనబడి జీవితం సర్వనాశనం ఔతుంది." గుండెల్లోంచి ఎవరో అరుస్తున్నారు.

అయితే తన ఆస్థిపాస్థు లేమౌతాయి? తన భార్యా బిడ్డల గతి ఏమవుతుంది?

మరి ఆనాడు నాగతి ఏమైంది? వరదరాజన్‌గొంతు సమాధానం చెప్పింది.

నిజమే తను వరదరాజన్ జీవితాన్ని అన్యాయం చేశాడు. అతడి అందాల స్వప్నాల్ని భగ్నం చేశాడు. అందకు తను శిక్ష అనుభవించక తప్పదు. కాని రాబోయే ప్రమాదాల ఫలితాలు కుటుంబానికంతకూ వర్తిస్తాయి. ఇదేం

న్యాయం? ఇందులో తన భార్యాబిడ్డల తప్పు ఏముంది. చేయని పాపానికి వాళ్లు శిక్ష ఎందుకు అనుభవించాలి?

నువ్వు బ్రతికివున్నావు కనుక! అంతరాత్మ ఘోషపెట్టింది.

నిజమే; తను బ్రతికివున్నంతకాలమూ వరదరాజన్ పగ చల్లారదు. తనను హింసించడంకోసం పగను ఆస్తిపాస్తుల మీదా, భార్యాబిడ్డలమీదా తీర్చుకుంటాడు వరదరాజన్.

మరి తను శాశ్వతంగా దూరమైపోతే ... అవును; తను శాశ్వతంగా దూరమైపోతే?

వరదరాజన్ మళ్ళీ ఈ కుటుంబం జోలికిరాడు. పగ చల్లారిందని సంతోషిస్తాడు. తనకి కావలసింది అదే.

తన జీవితంలో ఎన్నో మలుపులున్నాయి. దారిద్ర్యంలో చాలాకాలం వరకూ పెరిగాడు తను. అందుచేత తనకు కష్టాలలోతులు బాగాతెలుసు. దారిద్ర్యము ఎంత దుర్భరమైందో తెలుసు. కానీ - అమాయికపురోజీ ధనవంతురాలిగా జన్మించింది. సుఖమన్నది ఏమిటో తెలియని పసిహృదయం ఆ పాపది. తనమూలంగా రోజీ కష్టపడటం చూడలేడు. తన కలలపంట రోజీ దారిద్ర్యముతో అటమటించడమన్న ఊహను కూడా భరించలేదు తను. తనబిడ్డ కలకాలం సిరిసంపదలతో వర్ధిల్లాలి. కాలవారి యింటికోడలై ఐశ్వర్యంతో తులతూగాలి. ఇందుకు తను ఏ త్యాగానికయినా సంసిద్ధుడే.

కన్నీళ్ళు తుడుచుకుంటూ గొణుక్కున్నారు రంగధామరావుగారు.

"వరదరాజన్! నీ పగ తీర్చుకో - నా రక్తంతో నీ దాహాన్ని తీర్చుకో. కాని - నా భార్యాబిడ్డల్ని మాత్రం వదిలెయ్యి వరదరాజన్. నా పాపానికి వాళ్ళను బలి చెయ్యకు; వాళ్ళ జీవితాల్ని అన్యాయం చెయ్యకు వరదరాజన్."

ఇక, ఆయ నేమీ మాట్లాడలేకపోయారు.

* * *

రంగధామరావుగారు ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త వినగానే వూరంతా అట్టుడికిపోయింది.

జనసందోహంతో ఆ రోజు ఆయన యిల్లు కిటకిట లాడిపోయింది. ఆ రోజు సాయంత్రం వూళ్ళో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఇద్దరు పార్టీలవారూ ఒక్కుమ్మడిని ప్రజాసేవకునికి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రమంత్రి కావలసిన



వ్యక్తిని మృత్యువు తీసుకుపోయిందని సంతాపం ప్రకటించారు. జీవితంలో మంచికి నిలబడ్డ రంగధామరావుగారు లేకపోయినప్పటికీ, మంచిమాత్రం మిగిలిపోయిందన్నారు. ఆయన పెట్టిన ఒరవడి యువతరానికి ఆదర్శం కావాలన్నారు. ఎవ రెంతగా పొగిడితే నేం — రంగధామరావుగారు మరి లేరు కన్నీరు మున్నీరుగా విలపించే ఆయన భార్యా బిడ్డల కన్నీళ్ళు తుడిచేవాళ్ళు లేరు. చివరకు మిగిలిన సత్యం యిదే.

*　　　*　　　*

రంగధామరావుగారు పోయిన మూడో రోజున కాటోలు డాక్టర్ గిరిధర్ స్నేహితులతో అన్నాడు.

"పెద్ద హాస్పిటల్స్‌లోకూడా స్టాఫ్ యింత ఇర్రెస్పాన్సిబుల్‌గా ఎలా వుంటారో నాకు అర్థంకాదు. మొన్న రంగధామరావుగారికి ఆపరేట్ చేసి పెట్టిన కళ్ళు ఎవరివో వరదరాజన్‌వి అంటూ ఉత్తరం రాశారా — యిప్పుడు 'పొరబాటు జరిగింది, ఆ వరదరాజన్ కళ్ళు బెంగుళూర్‌కి పంపించాం. మీ ఆస్పత్రికి పంపిన కళ్ళు ఎవరివో స్వామినాధన్‌వి' అంటూ మరో వుత్తరం రాశారు ప్చ్! చూడండి. యిలా వున్నాయి పరిస్థితులు!"